# రంగుల కల

-చెన్నా రామమూర్తి

ఉరుము ఉరిమింది.

మెరుపు మెరిసింది.

నారాయణ ఒళ్ళంతా ఆనందంతో పరవశించింది.

ఈ ఉరుముకు, మెరుపుకు, నారాయణ జీవితానికి ఓ విడదీయరాని బంధం. ఉరుము ఉరిమి, మెరిసి, వాన కురిసిందంటే నారాయణ ఇంట్లో సిరుల పంట కురిసినట్లే.

వర్షాన్ని వాన అంటారు కొన్ని ప్రాంతాల్లో. ఈ ప్రాంతంలో వానలేక మూడు ఏండ్లు దాటింది. ఎక్కడో తుపాను వస్తే ఇక్కడ తుంపర్లు కురుస్తాయి.

పోయిన రెండు మాసాల క్రితం గూడా ఇలాగే ఉరుము ఉరిమింది. మెరుపు మెరిసింది. వాన కురిసింది. మూలపడ్డ మిలిటరీ సైన్యానికి పనిచెప్పినట్లు రైతులంతా పనిముట్లను బయటకు తీశారు.

భూమి పదునైనట్లుంది. దున్నటానికి కాన్లు సిద్ధమయ్యాయి. ఎద్దులకు పూజలు చేశారు. ఏ ఎద్దుకు చూసినా ఎర్రటి కుంకుమతో నుదుటిని తీర్చిదిద్దారు. కాడికి ఎదురుగా ముత్తయిదువలను రమ్మని రంగానికి దిగుతున్నారు. ఒక చిన్న తిరునాలలా ఉంది.

ఏ పొలంలో చూసినా జనమే. ఎక్కడ చూసినా ఎద్దుల అదిలింపులే. భూమి మెత్తగా బాగా నానింది. వడివడిగా పని సాగుతోంది. నారాయణ మరీ ఆనందంతో చేస్తున్నాడు.



వర్షంలేక ఎవరిళ్ళలో రూకలు లేవు. వాన కురిసింది గదా అనే ధైర్యంతో టౌనుకెళ్ళి మందులు, విత్తనాలు అప్పుతెచ్చాడు. మలి చినుకు కురిస్తే విత్తనమెయ్యటానికి సిద్ధంగా వున్నాడు. దున్నిన భూమి ఎండిపోతూ ఉంది. మలి చినుకు కోసం ఆకాశం వైపు మోరపైకెత్తి ఎదురు చూస్తున్నాడు. కానీ వాన కురియలేదు. వారం గడిచింది. రెండు వారాలు గడిచాయి. నెల గడిచింది. రెండు నెలలు గడిచాయి. ఉరుము లేదు. మెరుపు లేదు. వాన చినుకు లేదు. తెచ్చిన విత్తనాలకు మోక్షం లేదు. నారాయణ బతుకుకు అంతకూ అదృష్టం లేదు. దున్నిన నేలపై ఎండ గుర్రాలు పరుగులు తీస్తున్నాయి.

అందరికీ ఆశలుడిగిపొయ్యాయి. నారాయణ నిర్జీవమయ్యాడు. నెల దాటితే కొట్టువాళ్ళు నాలుగు రూపాయల వడ్డీతో నడ్డి విరిచేస్తారు. వాన కురిసిందంటే ఈ పాటికి మొలకలు బయటకొచ్చేవి. అదృష్టం అడవుల కాస్తూ ఉంటే మహరాజులు మాత్రం ఏం చేయగలరు?

రెండు మాసాల తర్వాత మళ్ళీ ఇప్పుడు ఉరుము ఉరిమింది. ఆశ చిగురించింది. మెరుపు మెరిసింది. ఆనందం పొంగింది.

రైతులంతా రచ్చబండ వద్ద చేరారు. ఎవరికి తోచిన మాటలు వాళ్ళు చెప్పుకొంటున్నారు. అందులో సంసార సమస్యలూ భాగం పంచుకున్నాయి. అక్కడ సంసార సమస్యలు సాగుతూ ఉంటే ఇక్కడ నారాయణ మదిలో తన పెండ్లి కావలసిన కూతురు రాజేశ్వరి మదిలో మెదిలింది. అతని లోకమంతా ఆమె చుట్టూ పరిభ్రమిస్తూ ఉంది.

"రాజేశ్వరికి జీవితమంటే తెలియదు. ఎంత మంది అందగాళ్ళు వచ్చినా నిరాకరిస్తుంది. ఎంత మాగాని ఉన్న వాళ్ళు వచ్చినా తోసిపుచ్చుతుంది. తనని మనువాడేవాడు గవర్నమెంటు ఉద్యోగస్తుడే కావాలంట. ఇదేం పోయే కాలమో... ఉద్యోగస్తుడంటే పడి చస్తారు... ఏం తిన్నామనో, ఏమో?... నెల్నాపొద్దు రెండు రూకలొస్తే, ఆ నెలలో చేసిన అప్పులకు సరిపోతాది. మల్లేముంటుంది. ఖాళీజోబి... దోబీతో సమానం... అదే, పదెకరాల మాగాని ఉన్నోళ్ళయితే రెండు మూడు కాన్ల ఎద్దులు, పదిపన్నెండు గేదెలు, ఇద్దరు ముగ్గురు జీతగాళ్ళు, ఇంట్లో చిక్కని పాలు, గట్టి పెరుగు, వెన్న, నెయ్యి, మజ్జిగ, ధాన్యం- అన్నీ సమృద్ధిగా ఉంటాయి. ఇన్ని రకాలున్న పెండ్లి కొడుకును వద్దని, గవర్నమెంటు ఉద్యోగస్తున్నే కావాలంటావు. తిక్కదానా!" అనుకున్నాడు నారాయణ మనసులో. అటూఇటూ చూసుకొని తనకుతానే నవ్వుకున్నాడు. అంతలో రాజేశ్వరి బిందె తీసుకొని మంచినీళ్ళకు ఆ దారిన బయలుదేరి వెళ్తాఉంది. పచ్చి పసుపుకొమ్మలాగుంది రాజేశ్వరి. పోయినంత దూరం చూడాలనిపించేంతటి అందం. ఆ అందాలరాశికి తగిన అందగాడే కావాలి మరి.

నారాయణను ఎవరో కదిలించారు.

"ఏమిరోయ్.... నారాయణ... మొన్న రాజీకి ఎవురో పెత్తనం ఒచ్చినారే ఏమయ్యింది... ఒప్పేసుకున్నారా..."

"లేదు మావా... ఈ యమ్మికి ఉద్యోగస్తుడే కావాలంట. ఒకటే పట్టు. మన బతుక్కు ఏ ఉద్యోగస్తుడు వస్తాడే అంటే ఇనలా. ఏం చెయ్యాల్నో ఏమో, దిక్కు తొయ్యలా మావా...! యాన్నో ఒకచోట గవర్నమెంటు ఉద్యోగస్తున్నే చూసి సెయ్యాలనుకుంటాంటా మావ... అంతకంటే ఇంగ చేసేది ఏముందబ్బా..." పరిస్థితిని వివరించాడు నారాయణ.

"సుబ్బరాయుడుగాడు యాటికి పొయినాడు, కనపరాదం లేదేంది?" అన్నాడు మళ్ళీ ఆ పెద్దమనిషే.

"వాడు ఇంటరు పాసయినాడు మావ... వాళ్ళ అయ్యవార్లంతా వీడికి డాక్టరో, ఇంజనీరో సీటు వస్తాదని, నెల్లూరుకో, హైదరాబాదుకో కోచింగు పంపమంటే, హైదరాబాదుకు పంపినా మావ..."

"హైదరాబాదుకు పంపినావా... ఒరె... అంతా అక్కడ రంగుల బతుకు దగురా... లెక్క ఎట్ల జేసినావు..." అన్నాడు పెద్దాయన, నారాయణ ఆర్థిక వ్యవస్థను అంచనా వేస్తూ.

"యాడా ఒడ్డీకి గూడా దొరకలా మావ. తుకారాం దగ్గర ఇండ్లు కుదువకు పెట్టి పదివేలు తెచ్చినా. మళ్ళీ పంట పండంగానే ఇస్తానన్నా... ఏదో సమయానికి ఆదుకున్నాడు ధర్మాత్ముడు..."

"పంట ఎప్పుడు పండుతాది. గింజలెప్పుడొస్తాయి. ఇండ్లెప్పుడు విడిపిస్తావు..." అనుమానంగా చెబుతున్నాడు పెద్దాయన.

మళ్ళీ కాసేపుండి "ఒరే నారాయణ... ఇప్పుడు వచ్చేది చిత్తకార్తి. చిత్తకార్తి ముందర తప్పకుండా వానలు కురవాల. భూమి దున్ని పెట్టినావు గదు... ఇత్తనాలు తెచ్చినావు గదు... ఏం భయంలేదులే. ఈ ఉరిమో మోడం ఇట్నే కుర్సవచ్చు. పొద్దున్నే మల్లా ఒకసారి అట్ల దున్నిరా... ముందుగానే ఎరువెయ్యి. పంట బాగా సేతికి వస్తది. అమ్మిది పెండ్లి అయిపోతుంది. వాడి సదువు ముగుస్తుంది. ఈసారికి బయట పడతావు పో..." జ్యోతిష్యం చెప్పినట్లు చెప్పినాడు పెద్దాయన.

"నిజంగానా మావా... నువ్వు చెప్పిన మాట జరిగిందంటే నీ నోట్లో ఇంత చెక్కెర పొయ్యనా..." అంటూ నవ్వుకున్నారు.

ఆకాశంలో దట్టంగా మేఘాలు అలముకొంటున్నాయి. ఉరుము వెంట ఉరుము. మెరుపు వెంట మెరుపు. సూర్య ప్రతాపం మరుగయ్యింది. మేఘాల కింద రంగురంగుల తూనీగలు రెక్కలు విప్పార్చి ఇష్టం వచ్చినట్లు ఎగురుతున్నాయి. తూనీగలు ఆడితే తప్పక వర్షం

వస్తుందన్నది నమ్మకం.

ఎక్కడా నీలాకాశం లేదు. ఆకాశం నిండా మబ్బుగా మేఘాలు చుట్టుముట్టాయి. నారాయణ హృదయాన్ని తన కొడుకు భావిజీవితం చుట్టుముట్టింది. దానికి తోడు పెద్దాయన చెప్పిన జ్యోతిష్యం లాంటి మాటలు నారాయణకు ఊరట కల్గిస్తున్నాయి.

"లెక్కలేకుంటె మానె... కష్టపడి చదివే కొడుకు పుట్టినాడు. అదే నాకు లక్ష. అంత లేందే ఇంత మంది అయ్యావార్లు తన కొడుకునే డాక్టరవుతాడని, ఎందుకు చెప్తారు. వాడు డాక్టరు కావాలగాని ఈ పదివేల అప్పు ఎంత? ఈ పాత కొంప పోతేపోయింది. పూర్తిగా అమ్మేసి వానికే ఖర్చులకు పంపితే, వాడు డాక్టరవుతాడు. మల్ల ఇట్లా పాతకొంపల్లో ఎవరుంటారు. ఏదో టౌనులో, ఏసి బంగాళాలో ఉంటాం. వాడు సూదులేసి దండిగా సంపాయిస్తే, మేము సూసుకుంటా ఉంటాం. ఏదో కోడలు పిల్ల పిడికెడు బువ్వ పెడ్తే తిని నేనూ, తనూ సల్లగుంటాం. అంతకంటే ఈ బతుక్కు ఇంక ఏం కావాల?... సాలు, సాలు... అంత బతుకు ఇయ్యి దేవుడా..." హృదయంలోనే దేవుడికి మొక్కుకున్నాడు, తన కలల్ని నిజం చెయ్యమని నారాయణ.

తూనీగలు మాయమై తుంపర్లు మొదలయ్యాయి. రచ్చబండను వదలి ఒక్కరొక్కరే ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు. జరగబోయే శుభ పరిణామాలను వివరించుకుంటూ...

వాన ఊపు అందుకుంది. గంట దాటింది. మోదులు, మోదులుగా కురుస్తోంది. దోనేలు పారాయి. వీధులు పారాయి. బజార్లో పెద్దకాలువ పొర్లిపోతూ పరుగులు తీస్తూ ఉంది. అందరూ వాకిళ్ళు తెరిచి ఒక పెద్ద వింతగా చూస్తున్నారు. మూడేళ్ళ తర్వాత అంతగా కురుస్తున్న వానను చూడరా మరి.

బడబడా ఉరిమింది. ఉరుములకు ఝుడుపు పుడుతుంది. అక్కడున్న చిన్న పిల్లలు, "అర్జునా, అర్జునా గోడకింద పిల్లోల్లుండారు బద్రం" అని కేకలేస్తున్నారు. అర్జునుడు విన్నాడో లేదోగాని, ఉరుములు, ఉరుములకు రెట్టింపుగా మెరుపులు, మెరుపులకు రెట్టింపుగా వాన పోటీపడి కురుస్తున్నాయి. నారాయణ హృదయంలో గూడా ఆనందం వాటికి రెట్టింపు స్థాయిలోనే ఉంది.

తెల్లారేసరికి బాగా తెరప ఇచ్చింది. నారాయణ కాడి కట్టుకొనిపోయి దున్నినాడు. భార్య మధ్యాహ్నం సద్ది తీసికొని పోయింది. హుషారుగా కాళ్ళు ముఖం కడుక్కొని వచ్చాడు. గానుగ చెట్టుకింద ఇద్దరూ కూర్చున్నారు. రాగిముద్ద చేతిలోకి తీసుకొన్నాడు. తెచ్చిన వంకాయ దబ్బుల్ని మధ్యలో వేసుకొన్నాడు. ఆ పూటకది పులిహోరంలాగుంది. మజ్జిగ, సంగటి వేసి గిన్నెలో నున్నగా కలుపుతూ ఉంది భార్య. సంసారం గురించి ఎంతసేపో మాట్లాడుకున్నారు. సంసార విషయాలంటే మాటలా... కొండవీటి చేన్తాడంత ఉంటాయి. తెగవు... తెల్లారవు... భార్య వెనుదిరిగి వెళ్ళింది. భార్య వెళ్ళిందేగాని, తాను కోరిన ఒక్కగానొక్క కోరిక, తాలిబొట్టు సర్దు చేయించలేదన్న బాధ మాత్రం నారాయణ గుండెను వదలివెళ్ళలేదు. నత కోరిక తీరుస్తానో, తీర్చలేనోనన్న సంకోచం నారాయణను ఎప్పుడూ తొలుస్తూనే ఉంటుంది.

సూర్యుడు పడమటి కొండల సందుల్లోకి దూరిపోయాడు. పిట్టలు గూళ్ళు చేరుకుంటున్నాయి. కొండవాలు వెంట గొర్రెలు, బర్రెలు ఇంటి ముఖం పట్టాయి. కాడి విప్పినాడు నారాయణ. తలపాగా విదిలించి నేలపైన వేశాడు. సైను బనియను జేబులోంచి బీడీ తీసీ వెలిగించి అక్కడ కూర్చున్నాడు. దున్నిన భూమినంతా కలియజూశాడు. జీవితం రంగుల చిత్రంగా మారనున్నట్లుంది. ఇల్లు చేరేసరికి బాగా చీకటి పడింది.

"టౌను నుంచి ఎరువుల సాపు ఆయన వచ్చిన్నాడు. ఎరువులు, ఇత్తనాల లెక్క ఇయ్యాలంట... రెండు నెలలు దాటిందని ఒకటే కసురుకుంటున్నాడు. అయ్యలేదు... మల్లా రమ్మని జెప్పిన..." అంది భార్య.

బాకీ మొత్తం జ్ఞప్తికొచ్చింది. తమాయించుకున్నాడు. కాళ్ళు కడుక్కునేలోపునే ఆయన వచ్చాడు.

"ఏమి సామి... మీకు తెలందేముంది. ఒక్క వాన పడి మల్ల రాకపాయ. వాన కురిసి పంట పండితే మీ బాకీ పెట్టుకుంటామా... పూలల్లో పెట్టి ఇయ్యమా సామి... ఇపుడు వాన పడింది. పంట సేతికి రాంగనే వడ్డీ, మొదలు అంతా నీకు తీరుస్తాలే సామి..." సంజాయిషీ ఇచ్చుకున్నాడు నారాయణ.

'వడ్డీ... మొదలు' అనే మాటలు ఆయనకు సంతృప్తినిచ్చాయి. కాఫీ తాగి వెళ్ళిపోయాడు.

కొడుకు దగ్గర నుండి, తాను బాగుగా చదువుతున్నట్లు, డాక్టరు సీటు తప్పక వస్తుందన్నట్లు జాబు వచ్చింది. సంతోషించాడు.

పొలం పనుల ఆలోచనలతో, ఎప్పుడో జాము తెలియని వేళ నిద్రలోకి జారుకున్నాడు. భళ్ళున తెల్లారింది.

తూనీగలు మాయమై తుంపర్లు మొదలయ్యాయి. రచ్చబండను వదలి ఒక్కరొక్కరే ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు. జరగబోయే శుభ పరిణామాలను వివరించుకుంటూ...

వాన ఊపు అందుకుంది. గంట దాటింది. మోదులు, మోదులుగా కురుస్తోంది. దోనెలు పారాయి. వీధులు పారాయి. బజార్లో పెద్దకాలువ పొర్లిపోతూ పరుగులు తీస్తూ ఉంది. అందరూ వాకిళ్ళు తెరిచి ఒక పెద్ద వింతగా చూస్తున్నారు. మూడేళ్ళ తర్వాత అంతగా కురుస్తున్న వానను చూడరా మరి.

పనులు ముగించుకొని, విత్తనాల మూట బండిలో వేసుకొని, ముగ్గురు కూలివాండ్లతో వెళ్ళి పని ప్రారంభించాడు. సాయంత్రానికి విత్తనం వేయటం ముగిసింది. మూడు రోజుల తర్వాత మళ్ళీ వర్షం కురిసింది. మొలకలు బయటికొచ్చాయి. మొలకలను చూసుకుంటూ కొడుకులు పుట్టినంత సంబరపడిపోయాడు నారాయణ.

తొలితడి, మలితడిగా వర్షం కురియటం, మొక్కలు బాగా ఎదగటం జరిగింది. ఆనందం వెల్లువలై హృదయం పొంగిపోయింది.

రెండు మాసాలు వడివడిగా గడిచిపోయాయి. రాజేశ్వరికి ఉద్యోగస్తుడు పెత్తనానికి వచ్చాడు. కాయం అయ్యింది. పది తులాల బంగారం, పది వేల డబ్బు కట్నంగా ఒప్పందం కుదిరింది. పంట చేతికొచ్చిన తర్వాతనే పెళ్ళి అని మాట్లాడుకున్నారు. పెత్తనం గూడా చిన్న పెండ్లిలా జరిగింది.

రాజేశ్వరి పెండ్లి బాధ్యత ముగుస్తున్నందుకు ఆనందంగా ఉంది. మహా అంటే ఎన్ని రోజులు. ఇంక మూడు నెలల్లో పంట చేతికొస్తుంది. నాలుగో నెలలో పెండ్లి. బరువు బాధ్యతలన్నీ తీరిపోతాయి.

పెండ్లి నాటికంతా తాకట్టు పెట్టిన ఇంటిని విడిపించుకోవాలి. ఈ విషయం వియ్యంకులకు తెలిస్తే బాగుండదని నారాయణ భావన. అదృష్టం కలిసి రావాలిగాని అన్నీ అవే జరిగిపోతాయి.

మోకాలెత్తుదాకా పెరిగింది పంట. చిన్న పిల్లల్ని సాకి సంతరించినట్లు చూసుకుంటున్నాడు మొక్కల్ని.

అన్నీ సవ్యంగానే సాగే సమయంలో వచ్చిందో పిడుగు లాంటి వార్త. అది కుదిపింది. గుండెను గాయం చేసింది. జీవితం చిత్రకారుడు సృష్టించిన చిత్తుప్రతిలా ఉంది.

"బంగాళాఖాతంలో వాయుగుండం లేచింది. అది పడమటి దిక్కుగా పయనించి రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే సూచన ఉంది. ఈ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండవలసిందిగా మనవి" అంటూ టీవీలు, రేడియోలు పదేపదే సూచనలిస్తున్నాయి.

రచ్చబండ దగ్గర అందరూ గుమికూడారు. అప్పటికే మేఘాలు నల్లటి రాక్షసుల్లా కమ్ముకొంటున్నాయి. మింగేస్తామని సూచనలిస్తున్నట్లుగా ఉన్నాయి. అందరూ విచారంగా, భయంగా ఎవరికి తోచిన సూచనలు వాళ్ళు చెబుతున్నారు. జాగ్రత్తలు తీసుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

నారాయణ అంతా విన్నాడు. కానీ సంతృప్తిగా లేదు. దిక్కు తోచడం లేదు. నారాయణ పొలం వంక సాలుపులో ఉంది. పెద్ద వంక వస్తే నీళ్ళ వెంట పైరంతా కొట్టుకొని పోతుంది. మిగిలిన నీళ్ళు నెలదాకా ఆరిపోవు. ఆరిపోయేసరికి మొక్కలు కుళ్లికురాకై పోతాయి. పంట చేతికి రాదు.

సన్నాహాలు జరుగుతుండగానే తుపాను మొదలయ్యింది. మొదలై వారం రోజులు పట్టి పీడించింది. బయటకు ముఖం లేదు. కొద్దిగా తెరప చూసుకొని తోట వద్దకు బయలుదేరాడు నారాయణ. మోకాలెత్తు పెరిగిన మొక్క ఒక్కటీ లేదు. నీళ్ళవెంట కొట్టుకొని పోయాయి. అక్కడొక మొక్క, అక్కడొక మొక్క మచ్చుకు కనిపిస్తున్నాయి. కానుగ చెట్టు మాత్రం గంభీరంగా విరబోసుకుంది. అదే తన తోటకు గుర్తు.

అంతా పొలప పారింది. ఆ సముద్రం లాంటి జలంలో కకావికలమౌతున్న రాజేశ్వరి పెళ్ళి, డాక్టరు పట్టా పొందలేకపోతున్న కొడుకు బతుకు, తాళిబొట్టు సరుటు నోచుకోలేని భార్య జీవితం చిత్తుచిత్తుగా పేలిపోయాయి.

ఇంటికి వెళ్తే టౌనునుండి షాపువాడు బాకీల కొస్తాడు. ఇళ్ళు విడవమని తాకట్టుకు పుచ్చుకున్న వాడొస్తాడు. జీవితం వివర్ణమయ్యింది. ఇన్ని బాధల బతుకు నాకు వద్దు అనుకున్నాడు నారాయణ.

కానుగ చెట్టును చేరుకున్నాడు. పొలానికి కొట్టాల్సిన మందుసీసా, అంచెమీద నుండి తీసుకున్నాడు. కళ్ళు గట్టిగా మూసుకొని గుటగుటా మింగేశాడు. అరగంటలో ఆయువు అనంత వాయువుల్లో కలిసిపోయింది. నారాయణ చరిత్ర ముగిసింది.

రాయలసీమ రైతుకు వస్తే అతివృష్టి, లేకపోతే అనావృష్టి. ఈ కథ, ఈ వ్యధ కొత్తకాదు. పునరావృతం... అంతే... కలలుకనే బతుకులకు కలలే మిగులుతాయి.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి పాట ఎటునుండో దూరంగా వినిపిస్తూ ఉంది–

"తలకు బంగారు తారలేల
తలకు మించిన తలపులేల
వలచి పొందగ గగనసుమములు,
కలయె జీవితము–"



3